# కరెంట్ అఫైర్స్

## ఫ్యూచర్ పాలసీ గోల్డ్ అవార్డ్ - 2018

★ ప్రపంచంలోనే మొదటి నూరు శాతం 'సేంద్రియ రాష్ట్రం'గా రికార్డులకెక్కిన సిక్కింకు ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ పాలసీ గోల్డ్ అవార్డ్-2018' లభించింది.

★ సిక్కిం అనుసరిస్తోన్న పర్యావరణహిత విధానాలు ప్రపంచంలోనే అత్యుత్తమమైనవిగా గుర్తిస్తూ ఐరాస ఆహార, వ్యవసాయ విభాగం ఎఫ్ఏఓ, వరల్డ్ ఫ్యూచర్ కౌన్సిల్ (డబ్ల్యూఎఫ్‌సీ), ఐఎఫ్‌వోఏఎం - ఆర్గానిక్ ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశాయి.

★ 2018, అక్టోబరు 15న రోమ్‌లోని ఎఫ్ఏఓ ప్రధాన కార్యాలయంలో ఈ పురస్కారాన్ని సిక్కిం ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ అందుకున్నారు.

★ ఈ పురస్కారాన్నే 'మేలిమి విధానాలకు ఆస్కార్'గా అభివర్ణిస్తారు. దీన్ని గెలుచుకునేందుకు 25 దేశాలకు చెందిన 51 నామినేషన్లతో సిక్కిం పోటీపడి అగ్రస్థానంలో ఉంది. బ్రెజిల్, డెన్మార్క్, ఈక్వెడార్‌ల విధానాలు సంయుక్తంగా తర్వాతి స్థానంలో నిలిచి 'ఫ్యూచర్ పాలసీ సిల్వర్ అవార్డ్ - 2018'ని గెలుచుకున్నాయి.

★ సేంద్రియ వ్యవసాయ విధానాలను అనుసరిస్తున్నట్లు 2003లోనే సిక్కిం అధికారికంగా ప్రకటించింది.

## నేర దర్యాప్తు డిజిటలీకరణ

★ నేర దర్యాప్తును డిజిటలీకరణ చేసే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్, ముంబయి, దిల్లీ, బెంగళూరు, చండీగఢ్, అహ్మదాబాద్‌లలో నేరం జరిగిన ప్రదేశాన్ని తప్పనిసరిగా వీడియో తీయనున్నట్లు 2018, అక్టోబరు 16న కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ తర్వాత దేశమంతటా ఈ పద్ధతిని అమలు చేసేందుకు ఆరు నెలల గడువు కోరింది.

★ నేర విచారణను చిత్రీకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని, నేరం జరిగిన చోటును వీడియో తీసే విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సమయం ఆసన్నమైందని 2018, ఏప్రిల్ 5న సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో కేంద్రం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది.

## ఎన్‌హెచ్ఆర్‌సీ రజతోత్సవం

★ జాతీయ మానవ హక్కుల కమిషన్‌ని (ఎన్‌హెచ్ఆర్‌సీ) స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2018, అక్టోబరు 12న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రజతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

★ ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఆర్‌సీ గౌరవార్థం ముద్రించిన ప్రత్యేక తపాలా బిళ్ల, పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించారు. ఆధునికీకరించిన ఎన్‌హెచ్ఆర్‌సీ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు.

★ మానవ హక్కుల పరిరక్షణ చట్టం - 1993 కింద ఎన్‌హెచ్ఆర్‌సీని 1993, అక్టోబరు 12న ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు సుమారు 17 లక్షలకు పైగా కేసులను పరిష్కరించిన కమిషన్ మానవ హక్కుల ఉల్లంఘనలకు గురైన బాధితులకు సుమారు రూ.100 కోట్లకు పైగా పరిహారం ఇప్పించింది.

## అగ్రశ్రేణి విద్యా సంస్థలుగా ఐఐటీలు

★ లండన్ కేంద్రంగా పనిచేస్తున్న క్వాకరెల్లీ సైమండ్స్ (క్యూఎస్) అనే అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ మన దేశంలోని మేటి విశ్వవిద్యాలయాలపై అధ్యయనం నిర్వహించింది. అగ్రశ్రేణి 10 విద్యా సంస్థల్లో ఏడు ఐఐటీలే నిలిచాయి. ఐఐటీ ముంబయి అగ్రస్థానంలో ఉంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) బెంగళూరు రెండో ర్యాంకులో ఉండగా, ఐఐటీ మద్రాస్ (3), ఐఐటీ దిల్లీ (4), ఐఐటీ ఖరగ్‌పూర్ (5), ఐఐటీ కాన్పూర్ (6), ఐఐటీ రూర్కీ (9), ఐఐటీ గువాహటి (10) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. హైదరాబాద్, దిల్లీ విశ్వవిద్యాలయాలు వరుసగా ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచాయి.

## 'పసుపు-కుంకుమ' పథకానికి నిధులు

★ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 86,04,304 మంది డ్వాక్రా ఆడపడుచులకు దసరా కానుకగా 'పసుపు-కుంకుమ' పథకం చివరి

నాలుగో విడత నిధులను విడుదల చేశారు. ఒక్కొక్కరికీ రూ. 2000 చొప్పున రూ. 1,721 కోట్లను విడుదల చేసినట్లు 2018, అక్టోబరు 16న రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత వెల్లడించారు.

**అత్యంత వేగవంతమైన కెమెరా**

★ కాంతిని అత్యంత స్లోమోషన్‌లో బంధించగల ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన కెమెరాను అమెరికాలోని కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ కెమెరా సెకనుకి 10 లక్షల కోట్ల ఫ్రేమ్స్‌ను క్యాప్చర్ చేయగలదని వెల్లడించారు.

★ టీ-కంప్రెస్డ్ అల్ట్రాఫాస్ట్ ఫొటోగ్రఫీగా (టీ-కప్) దీన్ని పిలుస్తున్నారు. కాంతి ప్రవర్తిస్తున్న తీరును అత్యంత తక్కువ వేగంలో పరీక్షించేందుకు వీలుగా దాదాపు కాలాన్ని స్తంభింపజేస్తున్న తరహాలో ఈ కెమెరా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

★ పదార్థాన్ని కాంతి తాకినప్పుడు చోటు చేసుకునే చర్యల వెనుక రహస్యాలను ఛేదించేందుకు, భౌతికశాస్త్రంలో పరిశోధనలను కొత్త పుంతలు తొక్కించేందుకు, వైద్య రంగంలో వినియోగానికి వీలుగా కొత్తతరం సూక్ష్మ దర్శినులను అభివృద్ధి చేసేందుకు టీ-సీయూపీ కీలకంగా మారుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

**బతుకమ్మ ఆడిన న్యూజిలాండ్ ప్రధాని**

★ 2018, అక్టోబరు 12న ఆక్లాండ్‌లోని ఈడెన్‌వార్ మెమోరియల్ హాల్‌లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ న్యూజిలాండ్ నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆ దేశ ప్రధానమంత్రి జెసిండా ఆర్డెర్న్ పాల్గొన్నారు. ఒక దేశ ప్రధాని బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ప్రపంచంలో ఇదే తొలిసారి.

**ఎన్డీ తివారీ కన్నుమూత**

★ కాంగ్రెస్ కురు వృద్ధుడు, ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల మాజీ ముఖ్యమంత్రి ఎన్డీ తివారీ (93) 2018, అక్టోబరు 18న దిల్లీలోని మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మరణించారు. ఈయన తన 93వ పుట్టిన రోజునాడే తుదిశ్వాస విడిచారు.

★ ప్రస్తుత ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని నైనిటాల్‌లో 1925, అక్టోబరు 18న నారాయణ్ దత్ తివారీ జన్మించారు. 1947లో వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1976లో తొలిసారిగా ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. యూపీకి మూడుసార్లు, ఉత్తరాఖండ్‌కు ఒకసారి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

★ కేంద్రంలో రాజీవ్ గాంధీ హయాంలో ఆర్థిక, పెట్రోలియం, విదేశాంగ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రణాళికా సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గాను వ్యవహరించారు. 2007 నుంచి 2009 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా సేవలందించారు.

**వెయ్యి కి.మీ. వేగంతో హైస్పీడ్ రైలు**

★ గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసే సరికొత్త హైస్పీడ్ రైలు నమూనాను చైనా ఆవిష్కరించింది. దీనికి సంబంధించిన స్కేల్ మోడల్‌ను సిచౌహన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూ నగరంలో జరిగిన నేషనల్ మాస్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎగ్జిబిషన్‌లో 2018, అక్టోబరు 12న చైనా ఆవిష్కరించింది.

★ చైనాలో ప్రస్తుతం నడుస్తున్న బుల్లెట్ రైళ్ల గరిష్ఠ వేగం గంటకు 350 కి.మీ. దీన్ని భారీగా పెంచేందుకు చైనా పరిశోధకులు కృషి చేస్తున్నారు.

★ టీ-ఫ్లైట్‌గా పిలుస్తున్న ఈ హైస్పీడ్ రైలును చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ ఇండస్ట్రీ కార్పొరేషన్ లిమిటెడ్ అభివృద్ధి చేస్తోంది. 29.2 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పు ఉండే తేలికపాటి క్యాబిన్లు దీనిలో ఉంటాయి. ఇవి అత్యధిక ఉష్ణోగ్రత, కాంతిని తట్టుకోగలవు.

**ఉత్తర ఐర్లాండ్ రచయిత్రికి మ్యాన్ బుకర్**

★ ఆంగ్ల సాహిత్యంలో ప్రతిష్ఠాత్మక మ్యాన్ బుకర్ ప్రైజ్‌ను ఈ ఏడాదికి ఉత్తర ఐర్లాండ్ రచయిత్రి అన్నా బర్న్స్ (56) గెలుచుకున్నారు. ఈమె రచించిన 'మిల్క్‌మ్యాన్' నవలకు ఈ అవార్డు దక్కింది. మ్యాన్ బుకర్ ప్రైజ్ 49 ఏళ్ల ప్రస్థానంలో ఈ అవార్డుకు ఎంపికైన తొలి ఉత్తర ఐరిష్ మహిళగా అన్నా గుర్తింపు పొందారు. తాను రాసిన మూడో పుస్తకానికే ఈ పురస్కారాన్ని పొందింది.

- ★ మ్యాన్ బుకర్ ప్రైజ్‌ను అందుకున్న 17వ మహిళ బర్న్స్. 2013 తర్వాత ఈ ప్రైజ్ అందుకున్న తొలి మహిళ కూడా ఈమే.
- ★ 20వ శతాబ్దం చివరినాళ్లలో ఉత్తర ఐర్లాండ్‌లో జాత్యంతర ఘర్షణలు, రాజకీయ అస్థిరత కాలంలో ఓ యువతి, వివాహితుడితో సంబంధం ఏర్పరచుకున్న ఇతివృత్తంతో 'మిల్క్‌మ్యాన్' నవల సాగుతుంది.
- ★ భారత్‌కు చెందిన అరుంధతీ రాయ్ (1997 – గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్), కిరణ్ దేశాయ్ (2006 – ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్), అరవింద్ అడిగాలు (2008 – ది వైట్ టైగర్) మ్యాన్ బుకర్ ప్రైజ్‌ను గెలుచుకున్నారు.

**యూత్ ఒలింపిక్స్ 2018**

- ★ మూడో యూత్ ఒలింపిక్స్‌ను 2018, అక్టోబరు 6 నుంచి 18 వరకు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో నిర్వహించారు. 'ఫీల్ ద ఫ్యూచర్' అనే నినాదంతో జరిగిన ఈ ఒలింపిక్స్‌లో భాగంగా 32 క్రీడల్లో 239 పోటీలు నిర్వహించారు.
- ★ ఈ యూత్ ఒలింపిక్స్ ఆసియా ఖండం వెలుపల నిర్వహించిన తొలి యూత్ ఒలింపిక్స్‌గా గుర్తింపు పొందాయి. మొదటి యూత్ ఒలింపిక్స్‌ను 2010లో సింగపూర్‌లో, రెండో యూత్ ఒలింపిక్స్‌ను 2014లో చైనాలోని నాన్‌జింగ్‌లో నిర్వహించారు.
- ★ తాజా క్రీడల్లో భారత్ 3 స్వర్ణాలు, 9 రజతాలు, ఒక కాంస్యంతో కలిపి మొత్తం 13 పతకాలు సాధించింది. 2010లో ఆరంభమైన యూత్ ఒలింపిక్స్ చరిత్రలో భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 2010 క్రీడల్లో భారత్ 8 పతకాలతో 58వ స్థానంలో, 2014 క్రీడల్లో కేవలం రెండు పథకాలతో 64వ స్థానంలో నిలవగా తాజా క్రీడల్లో మొత్తం 13 పతకాలతో 17వ స్థానంలో ఉంది.
- ★ వెయిట్ లిఫ్టర్ జరెమీ లాల్‌రినుంగా, షూటర్స్ మనుబాకర్, సౌరభ్ చౌదరిలు ఈ క్రీడల్లో భారత్‌కు మూడు స్వర్ణాలు అందించారు.
- ★ తదుపరి నాలుగో యూత్ ఒలింపిక్స్ 2022లో సెనెగల్‌లో జరగనున్నాయి.

**రచయిత: సీహెచ్. కృష్ణ ప్రసాద్**

www.eenadupratibha.net